KANCHARLA
# మనసులో మాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ | నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం

మంగళవారం 26 మే 2026


## పంట వ్యర్థాలు కాల్చొద్దు!

- రైతులకు వ్యవసాయ శాఖ సంచాలకుల సూచన
- ఉల్లంఘిస్తే 25 వేల వరకు భారీ జరిమానా
- వ్యర్థాలు కాల్చితే భూసారం దెబ్బతింటుంది: డాక్టర్ బి. గోపి

02





## కేటీఆర్ కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత లేదు!

### చెల్లి, బావ ఫోన్లనే ట్యాప్ చేశారు

- ఫోన్ ట్యాపింగ్‌పై మంత్రి పొంగులేటి ధ్వజం
- ఇందిరమ్మ ఇండ్లపై బీఆర్ఎస్ నేతకు సవాల్
- జూన్ 1న మరో 2.5 లక్షల ఇండ్లకు శ్రీకారం

03



## కోనసీమ నుండి ఎన్టీఆర్ భారీ విగ్రహం

- మైత్రీవనం కూడలిలో ఆవిష్కరణ
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- విభజన తర్వాత నగరంలో తొలి విగ్రహం

02



## మహిళలే దేశానికి ఆదర్శం!

- రుణాల పరిమితి రూ.10 లక్షలకు పెంపు
- కార్పొరేట్ తరహాలో మహిళా సూపర్ బజార్లు
- 8 వేల స్త్రీ శక్తి భవనాలకు సీఎం రేవంత్ శంకుస్థాపన

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఒకేసారి 8 వేల ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన చేశారు.

వివరాలు 4లో..

## ఈ-పాస్ స్కాలర్‌షిప్ గడువు పొడిగింపు!

03

## మెట్రో ఫేజ్-1 టేక్ ఓవర్

### ఐఆర్ఎఫ్‌సీతో మెట్రో రైల్ రుణ ఒప్పందం

- తగ్గిన రుణ భారం.. విస్తరణకు మార్గం సుగమం
- హైదరాబాద్ మెట్రోకు రూ.13,600 కోట్ల ఆర్థిక బలం!

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తర్వాత ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రూ.13,600 కోట్ల భారీ రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదిరింది. ఈ నిధుల సమీకరణతో మెట్రోపై ప్రస్తుత రుణ భారం తగ్గడమే కాకుండా, నగరంలో భవిష్యత్ విస్తరణ ప్రణాళికలకు మార్గం సుగమమైంది.

వివరాలు 5లో..



# పంట వ్యర్థాలు కాల్చొద్దు!

- రైతులకు వ్యవసాయ శాఖ సంచాలకుల సూచన
- ఉల్లంఘిస్తే 25 వేల వరకు భారీ జరిమానా
- వ్యర్థాలు కాల్చితే భూసారం దెబ్బతింటుంది: డాక్టర్ బి. గోపి



**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో యాసంగి సీజన్ వరి కోతలు దాదాపు పూర్తయ్యాయి. రాబోయే వానాకాలం పంటల సాగు కోసం రైతులు భూములను సిద్ధం చేసుకునే తరుణంలో, పాత పంట వ్యర్థాలను తగులబెట్టడంపై వ్యవసాయ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. పంట అవశేషాలను కాల్చడం వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువని స్పష్టం చేసింది. పంట వ్యర్థాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బన పదార్థం దెబ్బతింటుంది. దీనితో పాటు నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా నశిస్తాయి. దీని ప్రభావంతో భూసారం తగ్గి, భవిష్యత్తులో రసాయన ఎరువులపైనే ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే గాలి కాలుష్యం పెరిగి ప్రజలు ఆరోగ్య సమస్యల బారిన పడతారు. వేసవి కాలంలో మంటలు వేగంగా వ్యాపించి ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యర్థాల బహిరంగ దహనాన్ని పూర్తిగా నిషేధిస్తూ అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ జీవో నంబర్ 27 ప్రకారం కఠిన చర్యలు అమలు చేస్తోంది. భూములపై, చెత్త మైదానాల్లో లేదా ఇతర ప్రదేశాలలో వ్యర్థాలను కాల్చడం నేరం. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పర్యావరణ పరిహార రుసుము విధిస్తారు.

**సాధారణంగా చెత్తను కాల్చితే:** 5,000 రూపాయల జరిమానా విధిస్తారు.

**భారీ స్థాయిలో వ్యర్థాలను కాల్చితే:** 25,000 రూపాయల జరిమానా విధిస్తారు.

### శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం ద్వారా భూసారం మెరుగుపడుతుంది. సేంద్రియ కర్బన్ పెరిగి, రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. తద్వారా పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ సూచించింది.

ఇటీవల భూపాలపల్లి జిల్లాకు చెందిన రైతులు చాగర్ల చంద్రమౌళి, భాగ్యమ్మలు పంట వ్యర్థాలు కాల్చే క్రమంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన తీవ్ర విచారం కలిగించిందని అధికారులు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో సంబంధిత జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు కిందిస్థాయి సిబ్బందికి మెమోలు జారీ చేయడం జరిగిందని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రైతులకు మరింత విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించి భూముల సారాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు.

# కోనసీమ నుండి ఎన్టీఆర్ భారీ విగ్రహం!

మైత్రీవనం కూడలిలో ఆవిష్కరణ

సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

విభజన తర్వాత నగరంలో తొలి విగ్రహం




**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** కోనసీమ జిల్లా కొత్తపేట వడయార్ శిల్పశాలలో ప్రముఖ శిల్పి రాజ్‌కుమార్ వడయార్ చేతిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకున్న నందమూరి తారక రామారావు భారీ కాంస్య విగ్రహాన్ని సోమవారం హైదరాబాద్‌కు తరలించారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 28న అమీర్‌పేట మైత్రీవనం కూడలిలో ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ భారీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే ముమ్మరం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగు ప్రజల ఆరాధ్య దైవమైన ఎన్టీఆర్ విగ్రహాన్ని రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేస్తుండటం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని చూసేందుకు నందమూరి అభిమానులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.

# ఈ-పాస్ స్కాలర్‌షిప్ గడువు పొడిగింపు!

మే 31 వరకు దరఖాస్తుకు అవకాశం

కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌కు ఛాన్స్

డేటా అప్‌లోడ్ చేయాలని కాలేజీలకు ఆదేశం




**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణలో ఈ-పాస్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ స్కాలర్‌షిప్ నమోదు గడువును మే 31 వరకు పొడిగించారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులతో పాటు, రెన్యువల్ స్కాలర్‌షిప్‌ల కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు పెద్ద ఊరట కలగనుంది. కాలేజీల యాజమాన్యాలు, విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి అదనపు సమయం లభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 10.20 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ విద్యార్థుల డేటాను ఖచ్చితంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కాలేజీలకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

# ప్రధాని మోదీ విధానాలే దేశానికి శాపం!

'సబ్‌కా సాత్' కేవలం ఎన్నికల నినాదమే

అమిత్ షాకు ఆర్థిక సంక్షోభం తెలియదా?

గాంధీ భవన్‌లో వి.హనుమంతరావు ధ్వజం

**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పెట్రోల్ కొరత, విపరీతమైన ధరల పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు, దేశ ఆర్థిక పరిస్థితిపై ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో సామాన్యుడు ఎక్కడికి వెళ్లినా పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయని, ఇది కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనమని వి. హెచ్ విమర్శించారు. మోదీ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ఆయన స్నేహితులైన అంబానీ, అదానీలు మాత్రమే లాభపడుతున్నారని ఆరోపించారు.



ప్రధాని మోదీ నిరంతరం జపించే 'సబ్‌కా సాత్ – సబ్‌కా వికాస్' అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. ఆచరణలో మాత్రం అది 'అందరినీ ఇబ్బంది పెట్టే' విధానంగా మారిందని మండిపడ్డారు. అంతర్జాతీయంగా జరుగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు ప్రధాని మోదీ ఎందుకు ప్రయత్నం చేయలేదని వి. హెచ్ ప్రశ్నించారు. మోదీకి ట్రంప్ మంచి మిత్రుడని అంటుంటారని, ఆ ట్రంప్‌కు చెప్పి యుద్ధాన్ని ఆపించవచ్చు కదా అని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక పరిస్థితి పూర్తిగా కుంగిపోతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం హెచ్చరిస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఎలా గెలవాలో తెలిసిన అమిత్ షాకు, దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియడం లేదా అంటూ వి. హెచ్ ప్రశ్నించారు.

# సీఎం రేవంత్ రెడ్డితో పలువురు భేటీ!

సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన నాయకులు

కృతజ్ఞతలు తెలిపిన కార్పొరేషన్ల చైర్మన్లు

'ఆటా' ప్రతినిధుల మర్యాదపూర్వక భేటీ

హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి): సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని పలువురు ప్రముఖులు కలుసుకున్నారు. ఇటీవల వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లుగా, వైస్ చైర్మన్లుగా ఎంపికైన నాయకులు సోమవారం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తమకు ఈ పదవుల్లో అవకాశం కల్పించి, నమ్మకం ఉంచినందుకు ముఖ్యమంత్రికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

అదేవిధంగా సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ప్రతినిధులు కూడా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు సమాజం ఎదుర్కొంటున్న పలు అంశాలను వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



# కేటీఆర్‌కు ఆ అర్హత లేదు!

- ఫోన్ ట్యాపింగ్‌పై మంత్రి పొంగులేటి ధ్వజం
- ఇందిరమ్మ ఇండ్లపై బీఆర్ఎస్ నేతకు సవాల్
- జూన్ 1న మరో 2.5 లక్షల ఇండ్లకు శ్రీకారం

**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** సొంత చెల్లి, బావ ఫోన్‌లను కూడా ట్యాప్ చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కేటీఆర్‌కు బహిరంగ సవాల్ విసిరారు. నిరంతరం ఫామ్‌హౌస్‌లలో ఉండే వారికి క్షేత్రస్థాయి వాస్తవాలు ఏం తెలుస్తాయని ప్రశ్నించారు.

## రికార్డు స్థాయిలో ఇండ్ల నిర్మాణం

అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర సంవత్సరాల్లోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం




చేశారు. ఇందిరమ్మ పాలన అంటే ఏంటో గ్రామాల్లోకి వెళ్లి ఇండ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందన్నారు. జూన్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని, మే 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

## ప్రజలు వీఆర్ఎస్ ఇవ్వడం ఖాయం

రాజకీయ సన్యాసం తీసుకుంటానంటూ డ్రామాలు ఆడుతున్న కేటీఆర్‌పై మంత్రి పొంగులేటి విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించి, లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చి, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ లాంటి సిట్టింగ్ స్థానాల్లోనూ బీఆర్ఎస్‌ను ఓడించిన ప్రజలు.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి పూర్తిగా వీఆర్ఎస్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. అందువల్ల కేటీఆర్ ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని, అదే సమయంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఓట్లు అడగకూడదని, ఈ సవాల్‌కు సిద్ధమేనా అంటూ కేటీఆర్‌కు సవాల్ విసిరారు.

# పెట్రో ధరల భారాన్ని తగ్గించండి!

సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ

వ్యాట్ తగ్గించడమే ఏకైక పరిష్కారం

కాంగ్రెస్ వైఖరిపై బీఆర్ఎస్ నేత ఆగ్రహం



**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూడటం మానేసి, వెంటనే వ్యాట్ తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. పెట్రోల్, డీజిల్ ధరలు ప్రజల నడుము విరుస్తున్నాయని, రాష్ట్ర పన్నులు తగ్గించాలంటూ గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, నేడు అధికారంలో ఉండి ఎందుకు తగ్గించడం లేదని నిలదీశారు. ప్రతిపక్షాలపై అడ్డగోలుగా మాట్లాడటం కాదని, దమ్ముంటే మాట మీద నిలబడి వ్యాట్ తగ్గించి చూపించాలని సవాల్ విసిరారు.

## ప్రజలపై పెను భారం

కేంద్ర ప్రభుత్వం వారంలో నాలుగు సార్లు ఇంధన ధరలు పెంచి ప్రజలపై పెను భారం మోపితే, మరోవైపు రేవంత్ రెడ్డి రాష్ట్ర పన్నులు తగ్గించకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. పెరిగిన సాగు ఖర్చులను భరించలేక రైతులు సతమతమవుతుంటే, ఇంధన ధరల పెరుగుదల వారికి మరింత శాపంగా మారిందన్నారు. రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోవడంతో ద్రవ్యోల్బణం పెరిగి, అన్ని వర్గాల ప్రజల జీవనంపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పొలం దున్నాలన్నా, సామాన్యుడు బైక్ తీయాలన్నా, ఆటో కార్మికులు బతుకు బండి నడపాలన్నా ఇంధన ధరలు పెను భారంగా మారాయన్నారు.

## ఏడాదికి 2,000 కోట్ల అదనపు ఆదాయం

పెరిగిన ధరల వల్ల రేవంత్ ప్రభుత్వం వ్యాట్ రూపంలో ఖజానా నింపుకుంటూ పైశాచిక ఆనందం పొందుతోందని హరీశ్ రావు విమర్శించారు. పెరిగిన ధరలతో ప్రతి నెలా 162 కోట్ల రూపాయలు, ఏడాదికి దాదాపు 2,000 కోట్ల రూపాయల అదనపు వ్యాట్ ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి ప్రచారాలకే పెద్దపీట వేస్తోందని ఆరోపించారు.

ఎన్నికల ముందు వ్యాట్ పై విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా కనీసం సున్నా పాయింట్ ఒకటి శాతం వ్యాట్ కూడా తగ్గించకపోవడం వారి రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. నిజంగా ప్రజా పాలన అయితే వెంటనే పెట్రోల్, డీజిల్ పై కనీసం 10 శాతం వ్యాట్ తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదలపై మొసలి కన్నీరు కార్చే రాహుల్ గాంధీ, తెలంగాణలో జరుగుతున్న ఈ వ్యాట్ దోపిడీపై స్పందించి, వెంటనే వ్యాట్ తగ్గించేలా రేవంత్ రెడ్డిని ఆదేశించాలని కోరారు.

# భూదాన్ భూముల అక్రమ బదిలీ!

ఈడీ విచారణకు హాజరైన ఐఏఎస్ అమోయ్ కుమార్

మనీ లాండరింగ్ కోణంలో దర్యాప్తు

42 ఎకరాల కేటాయింపులపై ఆరోపణలు



**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** భూదాన్ భూముల అక్రమ బదిలీ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ కేసుకు సంబంధించి సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్ సోమవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. భూదాన్ భూముల వ్యవహారంలో మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు ఆయనను విచారిస్తున్నారు. అమోయ్ కుమార్ గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో జరిగిన అక్రమ భూ బదిలీలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే 2024లో కూడా ఆయనను పలుమార్లు అధికారులు విచారించారు. తాజాగా సోమవారం విచారణకు రావాల్సిందిగా ఈడీ మరోసారి సమన్లు జారీ చేసింది. విచారణకు వచ్చే సమయంలో మూడు సేల్ డీడ్లు, బ్యాంక్ ఖాతాలు, ఆస్తుల వివరాలను అందజేయాలని నోటీసుల్లో స్పష్టం చేసింది. దీంతో ఆయన కీలక పత్రాలు, సేల్ డీడ్ వివరాలతో అధికారుల ముందుకు వచ్చారు.

## 42 ఎకరాల కట్టబెట్టడంపై ఆరోపణలు

మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో 2023లో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. నాగారం గ్రామ పరిధిలోని విలువైన భూదాన్ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 42 ఎకరాల భూమిని అక్రమంగా కట్టబెట్టి, భారీ మొత్తంలో లాభాలు పొందినట్లు అమోయ్ కుమార్‌పై ఆరోపణలు రావడంతో ఈడీ అధికారులు ఆ దిశగా విచారణను వేగవంతం చేశారు.

# లాయర్ హత్య కేసులో పురోగతి!

బెంగళూరు హైవేపై స్కార్పియో స్వాధీనం

భూ తగాదాలే కారణమన్న పోలీసులు

కల్వకుర్తి వినయ్ సహా పలువురి విచారణ

**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ వద్ద కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఈ ప్రమాదంపై అనుమానాలు వ్యక్తంచేస్తూ, దీనికి కారణమైన నిందితులను వెంటనే పట్టుకోవాలని ఆయన కుమారుడు నగర పోలీస్ కమిషనర్‌ను కోరారు. తనకున్న అనుమానాలకు సంబంధించిన ఆధారాలను కూడా పోలీసులకు వివరించారు. ఈ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి కీలక ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ హత్యకు ఉపయోగించినట్లు భావిస్తున్న ఒక స్కార్పియో వాహనాన్ని బెంగళూరు హైవేపై పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు భూ తగాదాలే ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసుల వివరాల ప్రకారం, ఇంటి నుండి బయటకు వచ్చిన ఖాజా మొయినుద్దీన్‌ను నిందితులు పథకం ప్రకారం వాహనంతో ఢీకొట్టి హత్య చేసినట్లు గుర్తించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కారును గతంలో విక్రయించిన ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే, తాను ఆ వాహనాన్ని ఆరు నెలల క్రితమే అమ్మేశానని ఆ యజమాని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ వాహనం ఎవరి వద్ద ఉందనే కోణంలో అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి కల్వకుర్తికి చెందిన వినయ్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొంతమంది అనుమానితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడవుతాయని అధికారులు తెలిపారు.





# రోహిణి ప్రవేశంతో నిప్పుల కొలిమి!

**ఆసిఫాబాద్‌లో 46.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత**

**పలు జిల్లాల్లో ఈదురుగాలుల వర్షం**

**బయటకు రావద్దని వాతావరణ శాఖ హెచ్చరిక**



**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణలో ఎండలు రికార్డు స్థాయిలో మండిపోతున్నాయి. సోమవారం నుంచే రోహిణి కార్తె ప్రారంభం కావడంతో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఎండ తీవ్రత 45 డిగ్రీల నుండి ఏకంగా 46.5 డిగ్రీల సెల్సియస్‌కు చేరింది. ఉదయం 9 గంటల నుంచే మొదలవుతున్న ఎండ తీవ్రత, మధ్యాహ్నానికి నిప్పుల కొలిమిని తలపిస్తోంది. జనం ఇళ్ల నుండి బయటకు రావడానికే భయపడుతున్నారు.

### ఒకేసారి కురిసిన ఈదురుగాలుల వర్షం

తీవ్రమైన ఎండల నడుమ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో హఠాత్తుగా వర్షం కురిసింది. హైదరాబాద్‌లోని వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ఘట్‌కేసర్‌లో వడగండ్ల వాన కురిసింది. మెదక్, సూర్యాపేట జిల్లాల్లోనూ వర్షం పడటంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. అయితే మెదక్ పట్టణంలో రోడ్లు జలమయమై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మార్కెట్ యార్డుల్లో ధాన్యం బస్తాలు తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలుల తీవ్రతకు ర్యాలమడుగులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోగా, మంభోజిపల్లిలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సూర్యాపేట జిల్లా పాలకవీడులోనూ చెట్లు, స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

### జిల్లాల వారీగా ఉష్ణోగ్రతల వివరాలు

తెలంగాణ ప్రణాళికా సంఘం విడుదల చేసిన వివరాల ప్రకారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 46.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట, మంచిర్యాల జిల్లాల్లో 46.4 డిగ్రీలు, నల్గొండ, ఖమ్మం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 46.3 డిగ్రీల చొప్పున ఎండలు నమోదయ్యాయి. పెద్దపల్లి, హనుమకొండ జిల్లాల్లో 46.2 డిగ్రీలు, జగిత్యాలలో 46.1 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, మహబూబాబాద్ జిల్లాల్లో 45.9 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, జనగామ, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటడంతో రెడ్ అలర్ట్ ప్రకటించారు.

### హైదరాబాద్ పరిసరాల్లో పరిస్థితి

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 42.4, రంగారెడ్డిలో 43.1, సంగారెడ్డిలో 42.1 డిగ్రీల చొప్పున ఎండలు ఉన్నాయి. కేవలం నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మాత్రమే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి.

రాబోయే మూడు రోజులు ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎండలు మరింత ముదిరే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు తగ్గించుకోవాలని వాతావరణ శాఖ సూచించింది

# మహిళలే దేశానికి ఆదర్శం!

- రుణాల పరిమితి రూ.10 లక్షలకు పెంపు
- కార్పొరేట్ తరహాలో మహిళా సూపర్ బజార్లు
- 8 వేల స్త్రీ శక్తి భవనాలకు సీఎం రేవంత్ శంకుస్థాపన



**హైదరాబాద్, మే 25 (మనసులో మాట బ్యూరో):** 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమన్నారు. మహిళలు ఆర్థికంగా నిలబడితే కుటుంబం నిలబడుతుందని, కుటుంబం నిలబడితే గ్రామం బలపడుతుందని, తద్వారా తెలంగాణ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సోమవారం సచివాలయం వేదికగా రాష్ట్రంలో నిర్మిస్తున్న 8 వేల ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఒకే రోజు, ఒకే సమయంలో ఇన్ని భవనాలకు శంకుస్థాపన చేయడం దేశంలోనే సంచలనమని సీఎం అన్నారు. ఇవి కేవలం సమావేశాల స్థలాలు కావని, వారి ఆర్థిక కార్యకలాపాలకు, శిక్షణకు శాశ్వత వేదికలని చెప్పారు. ఇదే వేదికపై చిలకపచ్చ రంగులో ఉన్న ఇందిరమ్మ చీరల నాలుగు కొత్త డిజైన్లను సీఎం ఆవిష్కరించారు.

### ఆర్థిక ఊతం - రుణాల పెంపు

మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.60,472 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించిందని, వడ్డీ లేని రుణాల కోసం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని తెలిపారు. మహిళా సంఘాలు ఇకపై చిన్నచిన్న ఉపాధి కార్యక్రమాలకే పరిమితం కాకుండా పెద్ద వ్యాపారాల్లోకి రావాలని సీఎం పిలుపునిచ్చారు. రైస్ మిల్లులు, మండల స్థాయిలో గోదాములు, లాజిస్టిక్ పార్కులు నిర్మించుకోవాలని సూచించారు. వాటి కోసం అవసరమైన చోట 100 ఎకరాల వరకు భూములు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. వడ్లు కొనుగోలు చేసి, బియ్యం ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆడబిడ్డల చేతుల్లోకి ఈ వ్యవస్థ వెళ్తే పారదర్శకత, బాధ్యత మరింత పెరుగుతుందన్నారు.

### కార్పొరేట్ కు పోటీగా సూపర్ బజార్లు

మహిళా సంఘాల ఆధ్వర్యంలో డీమార్ట్, బిగ్ బజార్ వంటి కార్పొరేట్ సంస్థలకు పోటీగా అద్భుతమైన 'మహిళా శక్తి సూపర్ బజార్లు' నెలకొల్పాలని సీఎం సూచించారు. పట్టణాల్లో వీటి ఏర్పాటుకు తక్కువ ధరకు స్థలాలను లీజుకు ఇస్తామన్నారు. ఈ సూపర్ బజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటాదారుగా ఉంటుందని, రైతులు పండించే ఆర్గానిక్ ఉత్పత్తులు, నిత్యావసర సరుకులు వీటి ద్వారా వినియోగదారులకు చేరాలని ఆకాంక్షించారు.

### రవాణా, ఇంధన రంగాల్లో మహిళా శక్తి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా ఇప్పటివరకు ఆర్టీసీకి రూ.10 వేల కోట్లు చెల్లించినట్లు సీఎం తెలిపారు. మహిళలను బస్సుల యజమానులుగా మార్చేందుకు మహిళా సంఘాల ద్వారా 1000 బస్సులు కొనుగోలు చేయించి, ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జూన్ 5న పరేడ్ గ్రౌండ్‌లో 553 బస్సులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అలాగే పెద్ద సంస్థలకే పరిమితమైన సోలార్ ఎనర్జీ రంగంలోకి మహిళలను తెస్తూ 1000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

### జిల్లాల సమాఖ్యలతో ముఖాముఖి

ఈ సందర్భంగా సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు జిల్లాల ప్రతినిధులతో మాట్లాడారు. పెట్రోల్ బంక్ ద్వారా రూ.27 లక్షలు సంపాదించామని నారాయణపేట మహిళా సమాఖ్య సభ్యులు తెలపగా సీఎం వారిని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే బ్యాంకులకు వందకు వంద శాతం రీపేమెంట్ చేసిన నిర్మల్ జిల్లా సమాఖ్యను ప్రశంసించారు. వారికి ప్రధాన రహదారిలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

పెద్ద పెద్ద వ్యాపారవేత్తలు వేల కోట్లు ఎగ్గొట్టి పారిపోతుంటే, మహిళా సంఘాలు ప్రతి రూపాయిని నిజాయితీగా చెల్లిస్తూ వారికి ఆర్థిక క్రమశిక్షణలో గుణపాఠం నేర్పుతున్నాయని కొనియాడారు. గతంలో ఇచ్చిన నాణ్యత లేని చీరలను పొలాల్లో పిట్టలను తరిమేందుకు వాడేవారని, కానీ ఇప్పుడు ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఈ చిలుకపచ్చ రంగు కొత్త డిజైన్ చీరలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అధికారుల తరపున శేషాద్రి, దాన కిశోర్, శైలజా రామయ్యర్, అనితా రామచంద్రన్, దివ్య, శృతి ఓజా పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌తో 'ఆటా' ప్రతినిధుల భేటీ!

- అమెరికా మహాసభలకు రావాలని ఆహ్వానం
- జూలై 31 నుండి వేడుకలు



**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఈ ఏడాది జూలై 31 నుండి ఆగస్టు 2 వరకు నిర్వహించనున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) తెలుగు మహాసభలకు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆటా ప్రతినిధులు ఆహ్వానించారు. సోమవారం సచివాలయంలో వారు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

సీఎంను కలిసిన వారిలో ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల, కాన్ఫరెన్స్ రీజినల్ కోఆర్డినేటర్ తిరుమల రెడ్డి, ఈశ్వర్ బండా, ప్రవీణ్ పాల్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా మహాసభల ఏర్పాట్లను వారు ముఖ్యమంత్రికి వివరించారు.

# మెట్రో ఫేజ్-1 టేక్ ఓవర్

- ఐఆర్ఎఫ్‌సీతో మెట్రో రైల్ రుణ ఒప్పందం
- తగ్గిన రుణ భారం.. విస్తరణకు మార్గం సుగమం
- హైదరాబాద్ మెట్రోకు రూ.13,600 కోట్ల ఆర్థిక బలం!



**న్యూఢిల్లీ, మే 25 (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి):** హైదరాబాద్ నగర రవాణా మౌలిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్ఎఫ్‌సీ) ద్వారా రూ.13,600 కోట్ల వర్కింగ్ కాపిటల్ రీఫైనాన్సింగ్ లభించింది. ఢిల్లీలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ఒప్పందంపై ఐఆర్ఎఫ్‌సీ, ఎల్ అండ్... టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్, హెచ్ఎమ్ఆర్ఎల్ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దుబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌లో సమర్థవంతమైన, సుస్థిరమైన, ప్రజానుకూల ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. దేశ ఆర్థిక వృద్ధికి హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, నగర వేగవంతమైన అభివృద్ధికి అనుగుణంగా మెట్రో కనెక్టివిటీ విస్తరణ అత్యంత అవసరమని చెప్పారు. లార్సెన్ అండ్ టుబ్రో లిమిటెడ్ నుండి ఎల్ అండ్ టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్‌లోని 100 శాతం వాటాన్ని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అనంతరం ఈ రీఫైనాన్సింగ్ అమలులోకి వచ్చింది. దీంతో హైదరాబాద్ మెట్రో పూర్తిస్థాయి ప్రభుత్వ యాజమాన్యంలోని వ్యూహాత్మక ప్రజా రవాణా ఆస్తిగా మారింది. రూ.13,600 కోట్ల ఈ మొత్తాన్ని ప్రస్తుత రుణ బాధ్యతలైన నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ కాపిటల్ రీఫైనాన్సింగ్‌కు వినియోగించనున్నారు. దీని ద్వారా ప్రస్తుత రుణదాతలకు క్రమబద్ధమైన ఎగ్జిట్ లభించడంతో పాటు ప్రాజెక్టు ఆర్థిక స్థిరత్వం గణనీయంగా మెరుగుపడనుంది.

## 20 ఏళ్ల కాలపరిమితి

ఈ రుణాన్ని 20 సంవత్సరాల కాలపరిమితితో, త్రైమాసిక చెల్లింపుల విధానంలో రూపొందించారు. అధిక వడ్డీ రుణాలను తక్కువ వ్యయంతో కూడిన దీర్ఘకాలిక రూపాయి ఫైనాన్సింగ్‌తో భర్తీ చేస్తున్నారు. ఈ లావాదేవీకి తెలంగాణ ప్రభుత్వ కచ్చితమైన చెల్లింపు హామీ, రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీ, ఆర్‌బీఐ మద్దతుతో డైరెక్ట్ డెబిట్ మాండేట్ వంటి బలమైన వ్యవస్థ మద్దతుగా నిలిచాయి.

రోజుకు 5 లక్షల మంది ప్రయాణాలు

69.2 కిలోమీటర్ల పొడవుతో మూడు కారిడార్లు, 57 స్టేషన్లతో నిర్మితమైన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1 దేశంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో అభివృద్ధి చేసిన అతిపెద్ద మెట్రో ప్రాజెక్టుల్లో ఒకటి. ప్రస్తుతం ఈ నెట్‌వర్క్ ద్వారా రోజుకు 5 లక్షలకు పైగా ప్రయాణికులు సేవలు పొందుతున్నారు. ఈ రీఫైనాన్సింగ్ వల్ల కొత్త కారిడార్లు, చివరి మైలు కనెక్టివిటీ వంటి విస్తరణ ప్రణాళికలను వేగవంతం చేయడానికి అవకాశం కలుగుతుంది.

ఈ కార్యక్రమంలో హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్, ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్, ఎల్ అండ్ టీ మెట్రో ప్రతినిధి కె.వి.బి. రెడ్డి, సీఎఫ్‌వో ఏ.వి.ఆర్. శ్రీనివాస శర్మతో పాటు ఐఆర్ఎఫ్‌సీ, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మద్దతు ధరల పేరిట కేంద్రం మోసం!

- లెఫ్ట్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- కనీస వేతనాల పెంపుపై కమ్యూనిస్టుల హర్షం
- మూసీ నిర్వాసితులకు స్థానికంగానే ఇళ్లు



**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచడమే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. కనీసం 30 శాతం ధాన్యం కూడా కేంద్రం సేకరించడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో సీపీఎం, సీపీఐ బృందాలు సోమవారం వేర్వేరుగా ముఖ్యమంత్రితో సమావేశమయ్యాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆయా పార్టీల నేతలు సీఎంను కలిశారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయం తీసుకోవడంపై లెఫ్ట్ నేతలు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## హమాలీల కొరత.. నిరంతర సమీక్ష

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, మూసీ ప్రక్షాళన, విద్యా రంగ అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు వారి స్వస్థలాలకు వెళ్లడంతో ఇక్కడ కొంత కొరత ఏర్పడిందన్నారు. మరోవైపు ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదని చెప్పారు. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తూనే, మొక్కజొన్నను సైతం మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని వివరించారు.

## మూసీ ప్రక్షాళన.. పర్యాటకంగా మార్పు

మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారందరికీ స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదన్నారు. మూసీ నదిని పునరుజ్జీవింపజేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని, అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న దారుణమైన పరిస్థితులను ఈ సందర్భంగా నేతలకు వివరించారు.

## విద్యా రంగ ప్రక్షాళన.. పబ్లిక్ స్కూల్స్

ప్రభుత్వ విద్యను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నామని సీఎం తెలిపారు. విద్యా రంగంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంస్కరణలను నేతలకు వివరించారు. రాష్ట్రంలో కొత్తగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ.. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నేతలను రేవంత్ కోరారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, అందులో భాగంగానే విద్యార్థులకు నాణ్యమైన ఉపాహారం, భోజనం అందిస్తున్నామని వివరించారు.

# ధాన్యమంతా కొనుగోలు చేస్తాం!

**కేంద్రం తీరుపై మంత్రి తుమ్మల ఫైర్**

**ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ**

**యాతలకుంట టన్నెల్ పనులపై సమీక్ష**



**ఖమ్మం, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** దేశంలో అన్ని రకాల పంటలను కొనుగోలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ఒక్కటేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. వరి ధాన్యం కొనుగోళ్ల ఆలస్యానికి కేంద్ర ప్రభుత్వ వైఖరే ప్రధాన కారణమని ఆయన ధ్వజమెత్తారు. తప్పులు కేంద్రానివైతే, బాధ్యత లేకుండా బీజేపీ నేతలు బస్సు యాత్రలు చేయడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. పశ్చిమ ఆసియా యుద్ధ ప్రభావంతో దేశంలో గన్నీ బ్యాగుల కొరత ఏర్పడిందని, కేంద్ర ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్లే రైతాంగం ఇబ్బందులు పడుతోందని మండిపడ్డారు. డిజిటల్ ప్రక్రియలో లోపాల వల్ల ఎక్కడికక్కడ ధాన్యం రవాణా నిలిచిపోయిందని చెప్పారు. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్, బీజేపీ నేతలకు లేదన్నారు.

రాష్ట్రంలో ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, మిగిలిన ప్రతీ గింజనూ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. సోమవారం ఆయన యాతలకుంట టన్నెల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను కృష్ణా, గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమన్నారు. ఖమ్మం జిల్లాలో గోదావరి ప్రవాహ ప్రాంతం ఎక్కువ ఉన్నప్పటికీ, అత్యధిక భూభాగం నాగార్జున సాగర్ కెనాల్ కంటే ఎగువన ఉండటం వల్ల గతంలో జిల్లాకు గోదావరి ఆయకట్టు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తాను గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసినప్పుడే ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించాలని నాటి ముఖ్యమంత్రిని కోరినట్లు తుమ్మల గుర్తుచేశారు. నల్గొండ ఫ్లోరైడ్ బాధితుల కోసం నాటి సీఎం ఎన్టీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అవకాశం ఇచ్చారని, గోదావరిపై మొట్టమొదట దేవాదుల ప్రాజెక్టును తామే ప్రారంభించామని చెప్పారు. గోదావరి ఎత్తిపోతల పథకాలకు తప్ప మరో అవకాశం లేదని గుర్తించి, 1998లోనే దుమ్ముగూడెం ప్రతిపాదన తీసుకువచ్చామన్నారు. నాటి రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ పనులు గత ప్రభుత్వ హయాంలో కేవలం పంప్ హౌస్ నిర్మాణాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. కేసీఆర్ హయాంలో యాతలకుంట టన్నెల్ పూర్తి చేయడానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు.

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే మొదట రాజీవ్ లింక్ కెనాల్‌కు అనుమతులు ఇచ్చారని, కేవలం ఆరు నెలల్లోనే ఆ పనులను పూర్తి చేశామని మంత్రి తెలిపారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి అనుమతితోనే 15 నెలల స్వల్ప వ్యవధిలో రెండు కిలోమీటర్ల పొడవైన యాతలకుంట టన్నెల్ నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. ఈ టన్నెల్ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి నీరు అందించబోతున్నామన్నారు. టన్నెల్ పనులు పూర్తి చేసిన ఏజెన్సీని, అధికారులను ఆయన అభినందించారు. ఆగస్టు 15వ తేదీలోగా లైనింగ్ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 35 సంవత్సరాల క్రితమే డొక్కా సీతమ్మ అక్విడెక్ట్ నిర్మించామని గుర్తుచేశారు. ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసిన రైతులకు సరైన నష్టపరిహారం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా వెల్లడించారు.

# లారీల కొరత ఉన్నా ధాన్యం కొంటాం!

**తడిసిన గింజలనూ కొనుగోలు చేస్తాం: ఆది శ్రీనివాస్**

**ధాన్యం సేకరణపై బీఆర్ఎస్, బీజేపీ నాటకాలు**



**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** రాష్ట్రంలో పండిన ధాన్యమంతా ప్రభుత్వం తప్పక కొనుగోలు చేస్తుందని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపులో కొంత ఆలస్యం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లారీల కొరత సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ధాన్యం తరలింపు వేగవంతం చేయడం కోసం ఇసుక లారీలను, ట్రాక్టర్లను కూడా వినియోగిస్తున్నట్లు వెల్లడించారు.

### తడిసిన ధాన్యానికీ మద్దతు ధర

ఈ లోపు వర్షం పడి ధాన్యం తడిసినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ధాన్యం తడిసి రంగు మారినా సరే కొనుగోలు చేయాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆదేశించారని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్, బీజేపీలు కావాలనే రాజకీయ నాటకాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పిందని, ధాన్యం కొనుగోళ్ల గురించి మాట్లాడే హక్కు బీజేపీ నేతలకు లేదన్నారు.

### కేంద్రం కొనకపోయినా రాష్ట్రమే బాధ్యత వహిస్తుంది

రాష్ట్రంలో ఈసారి కోటి టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వచ్చిందని ఆది శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52 లక్షల టన్నులకు మాత్రమే మద్దతు ధర చెల్లిస్తామని చెబుతోందని విమర్శించారు. రాష్ట్రంలో పండే మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వానికి చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్రం కొనకపోయినా సరే మిగిలిన 70 లక్షల టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సేకరిస్తుందని స్పష్టం చేశారు. రైతులను అడ్డం పెట్టుకుని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మహిళల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం!

**కుల్కచర్ల, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా కుల్కచర్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ వంటకాల ప్రదర్శనను ఆయన ఆసక్తిగా వీక్షించారు. వంటకాల ప్రదర్శనను తిలకించిన అనంతరం ఎమ్మెల్యే మహిళలకు జంక్ ఫుడ్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. మన సాంప్రదాయ ఆహార పదార్థాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమంతో పాటు గ్రామీణాభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం!

- కృష్ణా జలాలపై ఇరు రాష్ట్రాల మంత్రుల భేటీ
- రైతాంగ అవసరాలకే తొలి ప్రాధాన్యత
- సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** నీటి వినియోగంపై ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాల పరిరక్షణకు అనుకూలంగా ఉండేలా ఒప్పందాలు కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వినియోగం, తాగు, సాగునీటి అవసరాలపై కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజుతో కలిసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సోమవారం ఆయన సుదీర్ఘంగా భేటీ అయ్యారు.

ఈ ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి పాల్గొన్నారు. రాయచూరు లోకసభ సభ్యుడు జి. కుమార్ నాయక్, నాగర్‌కర్నూల్ లోకసభ సభ్యుడు మల్లు రవితో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యుడు బసనగౌడ దద్దల్, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, శివకుమార్ రెడ్డి, వంశీకృష్ణ హాజరయ్యారు. అధికారుల తరఫున రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఐ. శ్రీధర్, సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్, ఈఎన్సీ రమేష్ బాబు, కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ కార్యదర్శి బి.కె. పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

### స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కృష్ణా జలాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామని చెప్పారు. భవిష్యత్తులో అనుసరించబోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉండేలా నిర్ణయాలు తీసుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు ఎలాంటి భంగం వాటిల్లనుండా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక మంత్రి బోసురాజుకు సమగ్రంగా వివరించినట్లు తెలిపారు. కృష్ణా నదిపై ప్రతిపాదిత బారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చించామని వెల్లడించారు.

### హక్కుల పరిరక్షణే ధ్యేయం

తెలంగాణ సాగునీటి, తాగునీటి హక్కుల పరిరక్షణ, భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధివిధానాలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు మంత్రి పేర్కొన్నారు. అంతరాష్ట్ర సమన్వయంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేలా రూపొందించిన ప్రతిపాదనలను కర్ణాటక ప్రభుత్వం ముందుంచినట్లు చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఈ చర్చల్లో తెలంగాణ రైతాంగ సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్ర హక్కులకు భంగం కలగకుండా, ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండేలా కృష్ణా జలాల వినియోగంపై కూలంకషంగా మాట్లాడామన్నారు. రెండు రాష్ట్రాల మధ్య జరిగిన ఈ చర్చల వివరాలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వివరించి, త్వరలోనే సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# చిరంజీవితో సినీ ప్రముఖుల భేటీ!

- పర్సంటేజీ విధానంపై ఎగ్జిబిటర్ల చర్చలు
- రెండు రోజుల్లో సమస్యకు పరిష్కారం
- ఇండస్ట్రీ కోసమే ఈ నిర్ణయం: దిల్ రాజు



**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** పర్సంటేజీ విధానంలో సినిమాల ప్రదర్శన అనేది కేవలం పెద్ద సినిమాలకు మాత్రమే సంబంధించింది కాదని, ఇది చిత్ర పరిశ్రమ మొత్తానికి చెందిందని తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్, నిర్మాత దిల్ రాజు స్పష్టం చేశారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు పారదర్శకమైన పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. సోమవారం టాలీవుడ్ అగ్ర కథానాయకుడు చిరంజీవిని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఎగ్జిబిటర్లు, నిర్మాతలు దిల్ రాజు, సురేష్ బాబు, కేఎల్ నారాయణ, అల్లు అరవింద్ తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దాదాపు గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

### ఇరు పక్షాల నుంచి వివరాల సేకరణ

సినిమాలు ప్రదర్శించే విషయంలో ఎగ్జిబిటర్లు, థియేటర్ యజమానులు కోరుతున్న పర్సంటేజీ విధానంతో పాటు ఎదురవుతున్న పలు సమస్యలను చిరంజీవి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పర్సంటేజీ విషయంలో ఒక స్పష్టమైన నిర్ణయానికి రావాలని ఇటు నిర్మాతలు, అటు ఎగ్జిబిటర్లకు చిరంజీవి సూచించారు. రాబోయే కొత్త చిత్రాల విడుదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశం అనంతరం దిల్ రాజు మాట్లాడుతూ, పర్సంటేజీ విధానంపై ఎగ్జిబిటర్లు చెప్పిన అన్ని విషయాలను చిరంజీవి సానుకూలంగా విన్నారని తెలిపారు. వారం కిందట ఛాంబర్ ఏర్పాటు చేసిన కమిటీ నుంచి మరిన్ని వివరాలు తెప్పించుకుని పరిశీలిస్తానని చిరంజీవి హామీ ఇచ్చారని వెల్లడించారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని, ఆ వివరాలను ఫిల్మ్ ఛాంబర్ అధికారికంగా ప్రకటిస్తుందని చెప్పారు.

### సింగిల్ స్క్రీన్ సమస్యలపై ఆరా

నగరంలో ఎదురవుతున్న సింగిల్ స్క్రీన్ థియేటర్ల సమస్యలను కూడా చిరంజీవి దృష్టికి తీసుకువెళ్లగా, ఇన్ని ఇబ్బందులు ఉన్నాయా అని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు దిల్ రాజు తెలిపారు. దీనిపై చర్చించేందుకు ఛాంబర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీని కూడా పిలిపించి మాట్లాడుతానని చిరంజీవి చెప్పినట్లు పేర్కొన్నారు. తాము కూడా ఎగ్జిబిటర్లతో కలిసి కూర్చొని మాట్లాడి త్వరలోనే ఒక తుది నిర్ణయానికి వస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ వస్తే 24 గంటల తాగునీరు!

- ఇందిరమ్మ ఇల్లు చూపిస్తే రాజకీయ సన్యాసం: కేటీఆర్
- కాంగ్రెస్ పాలనలో కుప్పకూలిన రియల్ ఎస్టేట్
- కూకట్‌పల్లి పార్టీ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సవాల్

**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ నగరంలో 24 గంటల పాటు తాగునీటిని సరఫరా చేస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. గతంలో నిరంతర విద్యుత్ అందించినట్లుగానే, ప్రతి ఇంటికీ తాగునీరు అందించి తీరుతామన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.



### ఇందిరమ్మ ఇల్లు చూపిస్తే సన్యాసం!

హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఒక్క ఇందిరమ్మ ఇల్లునైనా చూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ సవాల్ విసిరారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ శని, ఆదివారాల్లో పేదల ఇళ్లను కూలగొడుతున్నారని మండిపడ్డారు. కూకట్‌పల్లిలో హైడ్రా నోటీసుల భయంతో బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత విచారకరమన్నారు. నగరంలో ఇళ్లు కట్టడం చేతకాని ప్రభుత్వం, వేలాది ఇళ్లను కూలగొడుతోందని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి కేవలం ఇళ్లను కూలగొట్టడానికే పరిమితమయ్యారని విమర్శించారు.

### కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగం

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దివాళా తీసిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరా పార్క్ దగ్గర సెంట్రింగ్ కార్మికులు ఆందోళన చేస్తున్నారని, భవన నిర్మాణ కార్మికులకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి రాగానే కార్మికులకు బీమా సౌకర్యంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 2028లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### కార్యకర్తలకు తగిన గుర్తింపు

గతంలో తాము కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టామని, వచ్చేసారి అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకు, నాయకులకు తగిన గుర్తింపు, గౌరవం ఇస్తామని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు నమోదు చేసిన దొంగ ఓట్లు, నకిలీ ఓట్ల పట్ల బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జూన్ నెలలో డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రజల్లో తిరిగే వారికే రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో నగరంలో 350 బస్తీ దవాఖానాలు, డయాగ్నస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేశామని, నాలుగు వైపులా భారీ ఆసుపత్రుల నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి కేవలం రిబ్బన్లు కట్ చేయడానికి కత్తెర పట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

# బతికుంటే సాయం సున్నా.. చస్తే గౌరవం లేదు!

- భద్రాచలంలో భుజాలపై మృతదేహం తరలింపు
- కాంగ్రెస్ సర్కార్‌పై విరుచుకుపడిన కేటీఆర్
- ఎక్స్ వేదికగా మాజీ మంత్రి తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో పరిస్థితులు దారుణంగా దిగజారిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాచలంలో ఒక మృతదేహాన్ని కుటుంబ సభ్యులే భుజాలపై మోసుకెళ్లాల్సి రావడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బతికి ఉన్నప్పుడు సహాయం అందకపోయినా, మరణించాక కనీస గౌరవం కూడా దక్కని దౌర్భాగ్య స్థితికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను తీసుకెళ్లిందని ధ్వజమెత్తారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక పోస్ట్ పెట్టారు. పేదల అంతిమయాత్ర గౌరవప్రదంగా సాగాలనే ఉద్దేశంతో కేసీఆర్ హయాంలో ఉచిత మృతదేహాల తరలింపు వాహనాలను ఏర్పాటు చేశామని ఆయన గుర్తుచేశారు.

### ప్రచారానికే కోట్ల ఖర్చు

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ప్రచారం కోసమే కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. పోస్టర్లు, సభలు, పర్యటనలు, హెలికాప్టర్ల విలాసాల కోసం ఖర్చు పెట్టేందుకు డబ్బులు ఉంటున్నాయని, కానీ పేదలకు అవసరమైన ప్రాథమిక కనీస వసతులను అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎల్లప్పుడూ రాజకీయ కక్షసాధింపులు, విమర్శలు, ప్రచారాలలోనే నిమగ్నమైందని ధ్వజమెత్తారు. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలు ఈ ప్రభుత్వానికి అస్సలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నాయకుల పాదయాత్రల కోసం విలాసవంతమైన బస్సులు, ప్రచారాలకు ప్రభుత్వ వనరులు వాడుకుంటూ, పేదల అంతిమయాత్రకు కనీస గౌరవం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఈ ఘటన కేవలం ఒక కుటుంబం విషాదం మాత్రమే కాదని, తెలంగాణ సమాజాన్ని కుదిపేస్తున్న దయనీయ పరిస్థితికి అద్దం పడుతోందని పేర్కొన్నారు.




### భద్రాచలంలో కలచివేసిన ఘటన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో చోటుచేసుకున్న ఒక దారుణ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన కండె వెంకన్న (42) వడదెబ్బ తగలడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయనను పరీక్షించిన వైద్యులు వెంకన్న అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి, మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఆ తర్వాత మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రైవేటు వాహనాన్ని అద్దెకు తీసుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆసుపత్రి మార్చురీ వ్యాన్ సమకూర్చాలని అక్కడి అధికారులను పలుమార్లు వేడుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు ఆశగా ఎదురుచూసినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన కరువైంది. చివరకు చేసేదేమీ లేక కండె వెంకన్న మృతదేహాన్ని బంధువులే తమ భుజాలపై మోసుకుంటూ ఇంటికి తరలించారు. ఈ హృదయవిదారక దృశ్యాన్ని చూసిన స్థానికులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సదుపాయాలు కల్పించడంలో విఫలమవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు!

### ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం అబద్ధాలు

### ఎన్నంపల్లి ఐకేపీ కేంద్రాన్ని సందర్శించిన హరీశ్ రావు

### ఒకటి రెండు రోజుల్లో మార్పు రాకుంటే కలెక్టరేట్ల దిగ్బంధం

**సిద్దిపేట, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో రైతులు అరిగోస పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. యూరియా, సాగునీరు, విద్యుత్ సరఫరా, పండిన పంట కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. అన్నదాతలు ఇంతగా బాధపడటం తన జీవితంలో మొట్టమొదటి సారి చూస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్నంపల్లి గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి, వరి ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించారు.

### మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్!



ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ ఇలాంటి దుర్భర పరిస్థితులు రైతులకు ఎదురుకాలేదని పేర్కొన్నారు. మొన్నటికి మొన్న 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు 70 లక్షల మెట్రిక్ టన్నులే కొంటామనడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టడం కాదని, అవసరమైతే కేంద్రం మెడలు వంచైనా పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కోటి మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తే, అందులో 70 లక్షల టన్నులు మాత్రమే కొంటే మిగతా ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలో చెప్పాలన్నారు.

### తాలు పెడితే తోలు తీస్తారా?

తాలు పెడితే తోలు తీస్తా అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ సిద్దిపేట నియోజకవర్గంలో క్వింటాల్‌కు 5 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి కనీస కనికరం లేకుండా పోయింది. రోహిణి కార్తె ప్రవేశించినా సరే ధాన్యపు కుప్పలు, రైతులు కల్లాల్లోనే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం కేవలం 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించిందని తెలిపారు. అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నా ఈ సర్కారుకు కళ్లు కనబడటం లేదు. వరి కుప్పలపైనే రైతులు గుండె ఆగి ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇప్పటివరకు దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు విడిచారని ఆందోళన వ్యక్తం చేశారు.

### రేవంత్ రెడ్డి కేవలం పేపర్ టైగర్ మాత్రమే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వడ్ల కొనుగోలును మిషన్ మోడ్‌లో చేస్తామని అంటున్నారని, కానీ నడుస్తోంది మిషన్ మోడ్ కాదు, కమిషన్ మోడ్ అని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ధాన్యం కొనుగోలుపై అధికారులకు గట్టి ఆదేశాలు ఇస్తారని రైతులు ఎంతో ఆశగా ఎదురుచూశారు, కానీ వారి ఆశలన్నీ నిరాశే మిగిలాయి. 45 రోజుల్లో మొత్తం రైతుబంధు నిధులు వేస్తానని చెప్పి 60 రోజులు గడిచినా పైసా వేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి కేవలం పేపర్ టైగర్ మాత్రమేనని, దేవుడి మీద ఒట్టు పెట్టి మరీ మాట తప్పిన రకమని దుయ్యబట్టారు.

ముఖ్యమంత్రి ఢిల్లీ ట్రిప్పులు తగ్గించి, ధాన్యం రవాణాకు లారీల ట్రిప్పులు పెంచాలని హరీశ్ రావు సూచించారు. ఒకటి రెండు రోజుల్లో కొనుగోళ్లలో మార్పు రాకపోతే స్వయంగా తానే సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నాకు దిగుతానని హెచ్చరించారు. వేలాది మంది రైతులతో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాజకీయ విమర్శలు పక్కన పెట్టి, సంక్షోభానికి సరైన పరిష్కార మార్గాలు చూపాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# అర్జీలపై వెంటనే స్పందించాలి!

**అధికారులకు అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి ఆదేశం**

**ప్రజావాణిలో 1,053 దరఖాస్తుల స్వీకరణ**

**అత్యధికంగా హౌసింగ్ శాఖకే 840 అర్జీలు**



**హైదరాబాద్, మే 25:** ప్రజావాణి దరఖాస్తులను శాఖల వారీగా క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ఇంచార్జ్ డీఆర్ఓ శ్రీధర్ తో కలిసి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ప్రజలు అందజేసిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ లలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నందున ప్రజలు అక్కడ కూడా తమ దరఖాస్తులను అందజేయవచ్చని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రజావాణిలో మొత్తం 1,053 దరఖాస్తులు అందాయని అదనపు కలెక్టర్ తెలిపారు. అందులో హౌసింగ్ శాఖకు సంబంధించి అత్యధికంగా 840 అర్జీలు రాగా, పింఛన్ల కోసం 141, రెవిన్యూ శాఖకు 16, ఇతర శాఖలకు 16 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ డాక్టర్ సురేందర్, పరిశ్రమల జీఎం పవన్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి, సంక్షేమ అధికారులు కోటాజి, ప్రవీణ్ కుమార్, ఇలియాస్ అహ్మద్, ఏఓ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాసేవలో నిజాయితీ ముఖ్యం!

**గవర్నర్‌ను కలిసిన ఐఏఎస్ ప్రొబేషనర్లు**

**లోక్ భవన్‌లో యువ అధికారులతో చర్చ**

**ప్రగతిలో సివిల్ సర్వీసెస్ పాత్ర కీలకం**



**హైదరాబాద్, మే 25:** తెలంగాణ కేడర్‌కు కేటాయించిన 2025 బ్యాచ్ ఐఏఎస్ ప్రొబేషనర్లు సోమవారం ఉదయం లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డీఐ లో శిక్షణ పొందుతున్న ఈ యువ అధికారులు గవర్నర్‌తో ప్రత్యేకంగా సమావేశమై పరస్పర చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రగతిలో సివిల్ సర్వీసుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజాసేవలో విధులు నిర్వర్తించే సమయంలో నిజాయితీ, అంకితభావం, పారదర్శకత, ప్రజాకేంద్రిత పాలన విలువలను యువ అధికారులు కచ్చితంగా పాటించాలని సూచించారు. సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుతో పాటు సమగ్ర, స్థిరమైన అభివృద్ధి సాధనలో సివిల్ సర్వెంట్ల పాత్ర ఎంతో ముఖ్యమని గవర్నర్ తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డీఐ వైస్ చైర్‌పర్సన్, డైరెక్టర్ జనరల్ శాంతి కుమారి, కోర్స్ డైరెక్టర్ డాక్టర్ కందుకూరి ఉషారాణి పాల్గొన్నారు.

# సాధన కమిటీకి "బెస్ట్ ఎన్జీవో" పురస్కారం!

- రవీంద్రభారతిలో ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం
- అవార్డు అందుకున్న డాక్టర్ చంటి ముదిరాజ్, సూర ప్రవంతి
- నిరంతర కృషికి దక్కిన గౌరవం




**హైదరాబాద్, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం – 2005, పౌర హక్కుల రక్షణకై, పారదర్శకతకై నిరంతరం శ్రమిస్తున్న "సమాచార హక్కు చట్టం సాధన కమిటీ" కి అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ నుండి ఈ ఏడాదికి గానూ ఎంపికైన ప్రతిష్టాత్మక "బెస్ట్ ఎన్జీవో ఆఫ్ ది ఇయర్ – 2026" అవార్డును కమిటీ ప్రతినిధులు రవీంద్రభారతి వేదికగా అత్యంత వైభవంగా అందుకున్నారు.

హైదరాబాద్‌లోని ప్రముఖ సాంస్కృతిక వేదిక రవీంద్రభారతిలో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా, విజయవంతంగా ముగిసింది. సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర ప్రవంతిలతో పాటు కమిటీ ముఖ్య నాయకులు, ప్రతినిధులు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ చారిత్రాత్మక క్షణంలో భాగస్వాములు అయ్యేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జాతీయ, రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయి కమిటీ సభ్యులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అవార్డును అందుకున్న అనంతరం రవీంద్రభారతి ప్రాంగణం కమిటీ సభ్యుల హర్షధ్వానాలు, అభినందనలతో మిన్నంటింది.



## బాధ్యత మరింత పెరిగింది

ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, ఈ అవార్డు సమాజంలో తాము తెస్తున్న మార్పుకు, నిబద్ధతకు సగర్వ నిదర్శనమని పేర్కొన్నారు. నిరంతరం ప్రజాసేవలో భాగస్వాములవుతున్న కమిటీ సభ్యులందరి అలుపెరగని కృషి వల్లే ఈ రోజు ఈ ప్రతిష్టాత్మక వేదికపై ఈ గౌరవాన్ని అందుకోగలిగామని చెప్పారు. ఈ పురస్కారం భవిష్యత్తులో తమ బాధ్యతను మరింత పెంచిందని, ఇదే స్ఫూర్తితో ప్రజాసేవలో తమ సంస్థ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని సగర్వంగా ప్రకటించారు.

తెలంగాణ ప్రభుత్వ అధికారిక పురస్కారాన్ని అందుకుని, సరికొత్త ఉత్సాహంతో ప్రజాక్షేత్రంలోకి అడుగుపెడుతున్న సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులందరికీ పలువురు ప్రముఖులు, సామాజిక విశ్లేషకులు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కడమంచి అజయ్ కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు అరవింద స్వామి, బాపయ్య, బోగం విష్ణు, ముచ్చర్ల మల్లేష్, మూల జితేందర్ రెడ్డి, గుడ్డేటి ప్రవీణ్, దీపక్ కులకర్ణి, శ్రవణ్, –రేపాక కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ప్రగతికే ఇందిరా మహిళా శక్తి!

- ప్రతి నియోజకవర్గానికి మహిళా పెట్రోల్ బంక్
- కోటి మందిని కోటీశ్వరులును చేయడమే లక్ష్యం
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, మే 25 (మనసులో మాట ప్రతినిధి):** మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ప్రజాపాలన ఉ ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా సోమవారం మహిళా సంఘ సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 8 వేల మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయడంతో పాటు ఇందిరమ్మ చీరల కొత్త చిలకపచ్చ డిజైన్‌ను ఆవిష్కరించారు.

## సొంత భవనాలు.. పెట్రోల్ బంకులు

మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి విలేజ్ ఆర్గనైజేషన్‌కు సొంత భవనం నిర్మించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, స్థల వివరాలతో ప్రతిపాదనలు అందిస్తే మరుసటి రోజే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఒక పెట్రోల్ బంక్ మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్‌లో పెట్రోల్ బంక్ నిర్మాణం చివరి దశకు చేరగా, కోదాడలో స్థలం గుర్తించామన్నారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు సంబంధించి ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## రూ.700 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు

మహిళా సంఘాలు ధాన్య సేకరణకే పరిమితం కాకుండా సొంతంగా రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందన్నారు. జిల్లాకు 16 గోదాములు మంజూరయ్యాయని, లాజిస్టిక్స్ పార్క్ కోసం 10 ఎకరాల స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే మహిళా సంఘాలకు రూ.700 కోట్లకు పైగా బ్యాంక్ లింకేజ్ రుణాలు అందించామని, మహిళలు మరింత ఆర్థికంగా ఎదగడానికి మైక్రో క్రెడిట్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, పిల్లల్లో రక్తహీనత లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీఎంఓ నాగేశ్వర శర్మ పాల్గొన్నారు.